## వరి పరిశోధనా స్థానం కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి - ఆచంట**

రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వల్ల పరిశోధనా కేంద్రంలోని వరి పంట దెబ్బతినే పరిస్థితి నెలకొందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మార్టేరు వ్యవసాయ వరి పరిశోధనా కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికులు మూడో రోజు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శుక్రవారం నుండి కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఏళ్ల తరబడి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలులో ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడె శ్రీనివాస ప్రసాద్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు దమ్ము సూరకర్ణం, కట్ట శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, వెలగల సావిత్రి పాల్గొన్నారు.

# నేడు బంద్, సమ్మెకు సర్వం సన్నద్ధం

## జిల్లా, మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు - నేతృత్వం వహించనున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

**ప్రజాశక్తి - భీమవరం**

దేశవ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలకు పాతినిధ్యం వహిస్తున్న కిసాన్ సంయుక్త మోర్చా ఫిబ్రవరి 16న జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో శుక్రవారం ర్యాలీలు, సభలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్‌కు 'భారతరత్న' పురస్కారం ప్రకటించింది. అయితే ఆయన ప్రతిపాదించిన కనీస మద్దతు ధరను గత ప్రభుత్వాలు, నేటి బిజెపి ప్రభుత్వం పూర్తిగా తిరస్కరించాయి. డాక్టర్ స్వామినాథన్ రైతాంగానికి మేలు చేసే విధానాన్ని సమగ్రంగా అధ్యయం చేసి ప్రకటించారు. మద్దతు ధర అంటే రైతు పంటను పండించేదానికి అయ్యే ఖర్చు, రైతు కుటుంబం చేసే శ్రమకు అదనంగా 50 శాతం జోడించాలని వివరించారు. ఇది అమలు కానందునే వ్యవసాయం నేడు దివాలా తీసింది. నేటికీ మన దేశంలో ప్రజలు 65 శాతం వ్యవసాయంపైనే ఉపాధికి ఆధారపడి ఉన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలి పొట్ట కూటి కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయంపై ఆధారపడిన కూలీ, కౌలు రైతు, చిన్న, మధ్యతరగతి రైతులకు ప్రభుత్వం ఎటువంటి సహాయాన్నీ అందించడం లేదు. స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ జరగనంతగా 2021-22లో మూడు రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతాంగం మహా ఉద్యమం నడిపింది. ఆ సందర్భంగా ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని, రైతులకు మద్దతుధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని, రైతులపై కేసులు ఎత్తివేస్తామని చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదు. రైతులపై 45 వేల పోలీసు కేసులున్నాయి. 742 మంది ఈ ఉద్యమంలో మరణించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదు.

కార్మిక వర్గం స్వాతంత్రం ముందు నుండి సాధించుకున్న కార్మిక హక్కులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. అందుకే ముందుగా కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా 16న తలపెట్టిన జాతీయ పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు జిల్లాలోని కార్మికులు, రైతులు సిద్ధమయ్యారు. అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో నిరసనలు తెలిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

రైతు, కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న నేతలు (ఫైల్‌ఫోటో)

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ద్రోహం

## పిడిఎఫ్ ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి - భీమవరం**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను నమ్మించి మోసం చేసిందని కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు విమర్శించారు. భీమవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద జెఎసి ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలియజేసి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ద్రోహం చేశారని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ములు దాదాపు రూ.22000 కోట్లు వారికి ఇవ్వకుండా తన సొంత అవసరాలకు వాడుకున్నారని తెలిపారు. 11వ పిఆర్‌సిని పూర్తిగా అమలు చేయకుండా 12వ పిఆర్‌సి ఏవిధంగా అమలు చేస్తారన్నారు. ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి ఛైర్మన్ వి.జానకి రావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఎంవి.సత్యనారాయణ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయివర్మ పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్:** ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని గురువారం పాలకొల్లు జెఎసి ఛైర్మన్ గుడాల హరిబాబు అధ్యక్షతన వివిధ సంఘాల నేతల ఆధ్వర్యంలో పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయం, లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గుడాల హరిబాబు మాట్లాడుతూ జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్స్, డిఎ ఎరియర్స్, 11వ పిఆర్‌సికి సంబంధించిన ఏరియర్స్ బకాయిలు నగదు రూపంలో చెల్లించేందుకు కాలయాపన జరుగుతోందన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాలు 20వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. జెఎసి కన్వీనర్ వేగేశ్న మురళీకృష్ణంరాజు, యుటిఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాస్, ఎస్‌టియు నాయకులు వి.ఉదయ్ కుమార్, ఎపిటిఎఫ్ నాయకులు భాస్కర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్, యుటిఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాసరావు, కె.త్రినాథ్, జగ్గారావు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మండలంలోని పలు గ్రామాల ప్రాథమిక, జెడ్‌పి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ నేతలు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెవి.నరసింహమూర్తి, వి.సత్యనారాయణ, వై.ధర్మారావు, పి.జితేంద్రకుమార్, మంగతాయారు,ఉమాదేవి పాల్గొన్నారు.

వినతి అందజేస్తున్న ఎంఎల్‌సి ఐవి, జెఎసి నేతలు

మొగల్తూరులో నిరసన

# శాశ్వత ప్రాతిపదికన ఏటిగట్టు ఆధునికీకరణ పనులు

## చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

**ప్రజాశక్తి - నరసాపురం**

ఏటిగట్టు ఆధునికీకరణ పనులు తాత్కాలిక ప్రాతిపదికన కాదని, శాశ్వత నిర్మాణం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలో పొన్నపల్లి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఏటిగట్టు కుంగిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ గోదావరి ఏటిగట్టు పనులు తాత్కాలికంగా చేసేవి కావని, శాశ్వత నిర్మాణాలని అన్నారు. నరసాపురం పట్టణంలోని మాధవాయిపాలెంలో ఏటిగట్టు ప్రాంతంలో గోదావరి నది ఒంపు తిరగడం వల్ల నదీ ప్రవాహం సూటిగా వచ్చి నిర్మాణంలో ఉన్న ఏటిగట్టును తాకడం వల్ల గట్టు నదిలోకి జారుతోందన్నారు. గట్టును శాశ్వతంగా పటిష్టం చేసేందుకు సిఎం జగన్ నిధులు మంజూరు చేశారన్నారు. ఏటిగట్టు నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ విషయంలో దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, స్థానిక కౌన్సిలర్లు ఉన్నారు.

ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

# ఏటిగట్టు పనుల్లో అవినీతి : మాధవనాయుడు

## కుంగిన ఏటిగట్టు పరిశీలన

**ప్రజాశక్తి - నరసాపురం**

ఏటిగట్టు ఆధునికీకరణ పనుల్లో అవినీతి జరిగిందని తెలిసే విచారణకు అధికారులు ముందుకు రావడం లేదని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. గురువారం పట్టణంలో నాలుగోసారి కుంగిన గోదావరి ఏటిగట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడుతూ గోదావరి ఏటిగట్టు పనుల్లో నాణ్యతా లోపం కారణంగా ప్రారంభించిన ఆరు నెలల వ్యవధిలో నాలుగుసార్లు ఏటిగట్టు జారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు బినామీ పేర్లతో పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఏటిగట్టు పనుల్లో నాణ్యత లోపించి, అవినీతి జరగడంతో అధికారులు విచారణ చేయడం లేదన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి కూడా రాజకీయ ఒత్తిళ్లకు వంతపాడుతున్నారని విమర్శించారు. సాధారణ రోజుల్లోనే గట్టుకు రక్షణ లేకపోతే వర్షాకాలం, వరదల సమయంలో పరిస్థితి ఏమిటోనని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. పనులపై రిటైర్డ్ హైకోర్టు జడ్జితో విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు చిటికెల రామ్మోహన్‌రావు, పొనమండ నాగేశ్వరరావు, ఆండ్రాజు రామన్న, తంగెళ్ల నాగేశ్వరరావు, చెంపాటి సత్యనారాయణరాజు, రేవు ప్రభుదాస్, కొండేటి శ్రీను, మండ్రు హేమలత, చాగంటి సురేష్, మల్లి, చాగంటి ఆనంద్, అడిదెల డానియల్, రెడ్డిం శ్రీను పాల్గొన్నారు.

ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు

# కొనసాగిన న్యాయవాదుల నిరసన

**ప్రజాశక్తి - నరసాపురం**

ప్రజల ఆస్తులకు భద్రత లేని ఎపి భూహక్కు చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు అన్నారు. గురువారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. న్యాయవాదులు కోర్టు నుండి అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. నాలుగు నెలలుగా అనేక రూపాల్లో న్యాయవాదులు నిరసన తెలుపుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని, వెంటనే భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌జి.కుమార్, కంబాల స్వర్ణ, కొప్పినేడి పద్మజ, నెక్కంటి క్రాంతికుమార్, దొంగ సుభాష్, చేగొండి బాలాజీ, వెంకట రామారెడ్డి, చొడదాసి శ్రీధర్, పోలిశెట్టి రఘురాం, నారిన శ్రీను, పోలిశెట్టి సూరిబాబు, గునిసెట్టి శ్రీను పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# విద్యార్థులకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి చేయాలి

## జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తే ప్రమాదాల నివారణకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమా మహేశ్వరరావు కళాశాలలను కోరారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 60 శాతం మంది విద్యార్థులు, యువత ఉన్నారని పేర్కొన్నారు. హెల్మెట్ లేని చోట మరణాలు సంభవిస్తున్నాయన్న విషయాన్ని విద్యార్థులు, యువత గమనించాలని కోరారు. విద్యార్థులు వాహనాలను నడిపే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను కూడా గమనించాలని కోరారు. భీమవరం ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ దాస్ మాట్లాడుతూ యువత వాహనాలు నడపడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణమరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఇటీవల పలువురు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి దాతల సహకారంతో కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణచైతన్య, రవాణా శాఖ అధికారులు సిహెచ్.వెంకటేశ్వరరావు, కెఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఉమా మహేశ్వరరావు

సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

# ఆలోచన.. అవగాహన

**ఆకట్టుకున్న గ్రూప్స్, డివైఇఒ పరీక్షల అవగాహనా సదస్సు**

**డివైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ, యుటిఎఫ్ సంఘాలకు అభినందనల వెల్లువ**

**మూడు లక్షణాలు కలిగి ఉంటే విజయం మీ సొంతం**

**కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు**

**ఉద్యమాల్లో యువత భాగస్వామి కావాలి**

**ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు**

**ప్రజాశక్తి - భీమవరం**

స్థానిక త్యాగరాజ భవనంలో డివైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రూప్స్, డివైఇఒ పోటీ పరీక్షల సన్నద్ధతపై నిర్వహించిన ఉచిత అవగాహనా సదస్సు అభ్యర్థులను ఆకట్టుకుంది. పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి, ఏ సబ్జెక్టును ఏ విధంగా చదవాలి, అర్థం చేసుకోవాలి, పరీక్షలు రాసే ముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను అభ్యర్థులను సదస్సు ఆలోచింపజేసింది. సదస్సుకు ముఖ్యవక్తగా పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి, పోటీ పరీక్షల నిపుణులు కెఎస్.లక్ష్మణరావు, ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అభ్యర్థులు వక్తలు చెప్పే ప్రతి అంశాన్ని అర్థం చేసుకోవడంతోపాటు అర్థం కాని అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనేక ప్రశ్నలకు ఎంఎల్‌సిలు సమాధానాలిచ్చారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పోటీ పరీక్షల సన్నద్ధతకు ఉచిత అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జీవితంలో మరిచిపోలేమని అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. భీమవరం పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సదస్సుకు వచ్చిన అభ్యర్థులు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్‌లను అభినందించారు. సదస్సుకు డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అధ్యక్షత వహించారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు 'భారత సమాజం' అనే పుస్తకాన్ని, కెజిఆర్ఎల్ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీవాణి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల సామాజిక ఆర్థిక చరిత్ర అనే పుస్తకాలను ఆవిష్కరించారు. 250 మంది అభ్యర్థులకు ఎంఎల్‌సి లక్ష్మణరావు అందించిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు.

**మూడు లక్షణాలు కలిగి ఉంటే విజయం మీ సొంతం**

**కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి లక్ష్మణరావు**

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సమయస్ఫూర్తితోపాటు మూడు లక్షణాలు కలిగి ఉంటే విజయం వారి సొంతమవుతుందని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. ప్రిలిమనరీ, మెయిన్ పరీక్షలకు సన్నద్ధతపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. 150 మార్కులకు పరీక్షలు రాస్తే కనీసం 85 నుంచి 92 మార్కులు వస్తే మెయిన్ పరీక్షలకు అర్హత సాధిస్తారన్నారు. పోటీ పరీక్షల్లో ప్రతి మార్కు ఎంతో ముఖ్యమని చెప్పారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ప్రధానంగా మూడు లక్షణాలు ఉండాలన్నారు. సిలబస్‌పై పట్టు, పాత పరీక్షా పత్రాలు చదవడం, మెటీరియల్, గైడ్లు కాకుండా ప్రామాణిక పుస్తకాలు చదవడం వంటివి చాలా కీలకమన్నారు. పోటీ పరీక్షల్లో మైనస్ మార్కులు ఉంటాయని, జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎన్నడూ లేనివిధంగా గ్రూప్-2 పరీక్షల్లో 'భారత సమాజం' సిలబస్ పెట్టారన్నారు. మొదటి భాగంలో భారత సామాజిక అంశాలు, రెండో భాగంలో కేపిటలిజం, కమ్యూనిజం, మహిళాఇజం, మూడో భాగంలో రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణ చర్యలు ఉంటాయన్నారు.

**ఉద్యమాల్లో యువత భాగస్వాములు కావాలి**

**ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు**

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ అనేక సమస్యలపై పోరాడుతున్నాయని, యువత ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. 40 ఏళ్ల చరిత్రలో ఐదేళ్లలో ఒకసారి మాత్రమే డిఎస్‌సి ప్రకటించడం ఇదే మొదటిసారని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలు ఈ ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికోసం లక్ష్మణరావు మెటీరియల్ తయారు చేసి ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. నిరంతరం సమస్యల కోసం పాటుపడే డివైఎఫ్ఐ వెంట ఉండి సమస్యల పరిష్కారానికి అంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు.

**ప్రజా సంఘాల కృషి ఎనలేనిది**

**రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీవాణి**

సమాజంలోని సమస్యల పరిష్కారానికి ప్రజా సంఘాలు చేస్తున్న కృషి ఎనలేనిదని రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీవాణి అన్నారు. ఎన్నో పుస్తకాలు రాసి, యువతలో చైతన్యం తీసుకురావడం మామూలు విషయం కాదని లక్ష్మణరావును అభినందించారు. సాధారణ పరీక్షలకు పోటీ పరీక్షలకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ విషయం గమనించి పరీక్షల్లో ముందుకు సాగాలన్నారు. పట్టుదలతో పరీక్షలు రాయాలన్నారు. పోటీ పరీక్షలకు ఇటువంటి ఉచిత సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

**నిజాయితీకి మారుపేరు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు**

**యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి**

నిజాయితీకి మారుపేరు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. 2007 నుంచి 29 మంది శాసనమండలికి పిడిఎఫ్ తరపున ఎన్నికయ్యారని, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులే దీనికి కారణమన్నారు. మండలిలో సమస్యలపై గళమెత్తడంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిల కృషి అభినందనీయమన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో కేవలం అతి తక్కువ పోస్టులకు డిఎస్‌సి ప్రకటించి మెగా డిఎస్‌సి అని చెప్పడం సిగ్గుచేటన్నారు. జిఒ 117ను రద్దు చేయాలన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, పెనుగొండ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ, భవాని ప్రసాద్, అభ్యర్థులు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరైన అభ్యర్థులు

# దాతల సహకారంతో క్రీడా సదుపాయాలు

## డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఔత్సాహికులైన దాతలు మరింత మంది ముందుకొస్తే వారి సహకారంతో తాడేపల్లిగూడెంలో మరింత మెరుగైన క్రీడా సదుపాయాలను సమకూర్చుకోవచ్చునని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. డాక్టర్ ప్రసాద్ హాస్పిటల్స్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ పిఎల్‌వి.ప్రసాద్ మున్సిపల్ స్పోర్ట్స్ అరేనాను గురువారం ఆయన ప్రారంభించారు. అత్యంత ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు మూడింటిని, మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇండోర్ స్టేడియం లేదనే కొరత దీంతో తీరుతుందన్నారు. ప్రజా వైద్యుడిగా పేరుపొందిన డాక్టర్ పిఎల్‌వి.ప్రసాద్ పేరిట ఇది ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫుడ్‌ఫ్యాట్స్ అధినేత ఓపి గోయెంకా, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జిఆర్.రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త నంద్యాల కృష్ణమూర్తి, డాక్టర్ పి.శోభారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్న జనార్ధన్‌రావు, ప్రముఖ న్యాయవాది మాకా శ్రీనివాసరావు, వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అరేనాను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

# ఉండిలో టిడిపి కోటకు బీటలు..!

## ఎవరికివారు టిక్కెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు - నేతలు, కార్యకర్తల్లో ఆందోళన

**ప్రజాశక్తి - ఆకివీడు**

ఉండి నియోజకవర్గంలో టిడిపి గ్రూపు పోరు రోజు రోజుకూ పెరిగిపోతోంది. దీంతో కార్యకర్తల్లో ఆందోళన ప్రారంభమైంది. ఒకపక్క సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజు తన ప్రయత్నాలు చాప కింద నీరులా భారీగా సాగిస్తున్నారు. అదే రీతిలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు సైతం తన ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలో విలేకర్లతో శివరామరాజు సమావేశం నిర్వహించి చంద్రబాబు మద్దతు తనకే ఉందని, పార్టీ టిక్కెట్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గతంలో ప్రజలకు సేవలందించిన శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా తిరిగి సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 15 ఏళ్ల క్రితం అదే మార్గంలో ఆయన గెలుపొందారు. మళ్లీ అదే సెంటిమెంట్‌ను ప్రజల ముందుకు తెచ్చి ఫలితం పొందాలని ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజు రహస్య సమావేశాలు ప్రారంభించారు. తనకు పార్టీ యువ నాయకుడు లోకేష్ మద్దతు ఉందని ఆయన బహిరంగంగానే చెబుతున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు జోరుగా సాగిస్తున్నారు. వీరిద్దరి ప్రయత్నాలు పార్టీకి తలపోటుగా మారాయని కార్యకర్తలు తల పట్టుకుంటున్నారు. ఈ దశలో పిల్లి పోరు పిట్ట తీర్చిందా అన్న తంతుగా మూడో వ్యక్తి రంగంలోకి వచ్చే అవకాశం ఉందన్నట్లుగా కొత్త పేరు వినపడుతోంది. మాజీ ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణరాజు ఎందుకు ఎంఎల్ఎ కాకూడదన్నది పలువురి మాట. ఇదిలాఉండగా మరో కొత్త స్లోగన్ తెరమీదకొచ్చింది. టిడిపి అంతర్గత వ్యవహారాలు తీరేవి కాదని, ఈ దశలో జనసేనకు అవకాశం ఇవ్వాలని మరో గ్రూపు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. దశాబ్దాల తరబడి అసెంబ్లీ మెట్లెక్కుదామని ఆశిస్తున్న ఓ పెద్దాయన ఇదే అవకాశంగా తీసుకునే పరిస్థితి ఉందని కొందరు అంటున్నారు. ఆయన ప్రస్తుతానికి టిడిపిలోనే ఉన్నప్పటికీ టిక్కెట్ దొరికితే జనసేన నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. టిడిపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో సొంతంగా ముసలం తెచ్చుకుంటుందా.. పరిస్థితి మారకపోతే ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని ప్రశ్నార్థకంగా ఉంది.

పెదఅమిరంలో ఫిల్టర్ బెడ్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

**ప్రజాశక్తి - కాళ్ల**

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. పెదఅమిరంలో తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లను సర్పంచి డొక్కు సోమేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు సుమారు రూ.6 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. వాటిని వినియోగంలోకి తీసుకొస్తే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉంటుందన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

## విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

**ప్రజాశక్తి - గణపవరం**

పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల వంటి లోపాలను నివారించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఐరన్ మాత్రలు వాడాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు.గురువారం స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతను అరికట్టడానికి ఐరన్ మాత్రలు ఉపయోగపడతాయన్నారు ప్రతి గురువారమూ తమ ఆసుపత్రి పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎఎస్ఎస్‌బిఆర్.ప్రసాద్ ఉపాధ్యాయులు శ్రీనివాసు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం

**ప్రజాశక్తి - పాలకొల్లు**

కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థి దశలో చాలా అవసరమని ప్రముఖ పేథాలజిస్ట్ ప్రశాంతి చెప్పారు. పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ, మహిళా డిగ్రీ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ అంశంపై ఆమె అతిథిగా హాజరై ప్రసంగించారు. భాషా నైపుణ్యం ఉన్నవారు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. అనంతరం ఇటీవల జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తమ సేవా పురస్కారం పొందిన కళాశాల సిపిడిసి సభ్యులు కొమ్ముల మురళీకృష్ణను ప్రిన్సిపల్ శోభారాణి సన్మానించారు. కళాశాల పూర్వ విద్యార్థిని దుర్గాంజలి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, బ్యూటీషియన్ వారిజ లిల్లీ, హేమలత, నోబుల్ రాజ్, శిరీష, జూలియా, రమేష్, స్వరూప్ సింగ్, రమణ, రామ్మోహనరావు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు శ్రీనివాస్

## కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

వెంప గ్రామంలోని కొత్తపేటలో గత టిడిపి ప్రభుత్వం ఇచ్చిన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంప గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి డిజిటల్ అసిస్టెంట్ సైనీ, విఆర్ఒ ముత్యాలరావు జోష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం ఇచ్చిన కాలనీలో 2020 నుంచి 35 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అనేకసార్లు రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, పైపు కనెక్షన్లు ఏర్పాటు చేయాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అనేకసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఓట్లు, సీట్ల కోసమే తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన జరుగుతోందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈదా భూషణం, బొబ్బనపల్లి సునీల్, జి.మంగ, పూదిండి భవాని పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ దేవస్థాన హుండీ లెక్కింపు

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. గుమ్ములూరులోని సోమేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి విటాకుల శ్రీనివాసరాజు, గుమ్ములూరు లోకేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించామని తెలిపారు. 48 రోజులుగా అమ్మవారికి యాత్రికులు కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించింది రూ.11,54,585 అని తెలిపారు. కార్యక్రమంలో పెంటయ్య, రామారావు, మాణిక్యాలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## 'మళ్లీ జగన్‌నే సిఎం కావాలి'

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తిరిగి అమలు కావాలంటే జగన్ రెండోసారి సిఎం కావాల్సిన అవసరం ఉందని వైసిపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల చెప్పారు. పాలకొల్లు పదో వార్డులో రెండో రోజు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపితో పాటు ఆమె ఇంటింటికీ 'జగనన్నతో జనం గోపన్నతో మనం' ప్రచారం చేశారు. ఈ సందర్భఆ ఆమె మాట్లాడారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్‌దే అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

## జనసేనకు 41 సీట్లు ఇవ్వాలి : జోగయ్య

**పాలకొల్లు** :రాష్ట్రంలో 25 శాతం జనాభా ఉన్న కాపు ఒంటరి బలిజ, తూర్పుకాపు కులస్తులకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని కాపుసేన వ్యవస్థాపకులు చేగొండి హరరామ జోగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 41 అసెంబ్లీ స్థానాలు, 6 ఎంపీ స్థానాలను కాపులకు ఇవ్వాలని పవన్ కళ్యాణ్‌కు లేఖ రాశారు. ఆయా స్థానాల్లో పోటీకి నిలపాల్సిన అభ్యర్థుల పేర్లను కూడా ఆయన సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నర్సాపురం లేక భీమవరంలో పవన్‌కళ్యాణ్, తాడేపల్లిగూడెం, బొలిశెట్టి శ్రీనివాస్, నిడదవోలు చేగొండి సూర్య ప్రకాష్, ఉంగుటూరు పుప్పాల శ్రీనివాస్, ఏలూరు, రెడ్డి అప్పలనాయుడు లేక నారా శేషు తదితర అభ్యర్థుల పేర్లను సూచించారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్ష

**వీరవాసరం:** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీరవాసరంలో ప్రయివేటు హైస్కూళ్లలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. లిటిల్ బడ్స్, డివైన్‌మెర్సీ హైస్కూల్స్‌లో నిర్వహించిన ఈ టెస్ట్‌లో సుమారు యాభై మంది ఆయా స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించిన ఈ టెస్ట్‌కు సబ్జెక్టుల వారీగా వంద మార్కులకు టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుంది.

## వాలంటీర్‌కు సేవారత్న అవార్డు

**ఆచంట:** ఆచంట పంచాయతీ పరిధి చింతలతోట గ్రామానికి చెందిన సబ్బతి బుజ్జి బాబు ఆచంట-1 లో వాలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనన సేవారత్న అవార్డు కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చింతల తోట గ్రామస్తులు, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

## ప్రతి ఇంటికీ సురక్షిత నీరు : ఎంఎల్ఎ నిమ్మల

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

పూలపల్లితోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందిస్తానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటికీ పాదయాత్రలో భాగంగా నాలుగో రోజు గురువారం పూలపల్లిలో ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, జనసేన నాయకులు బోనం చిన్నబాబు, శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఎంఎల్ఎ నిమ్మలకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ పూలపల్లిలో ఏ వీధికి వెళ్లినా తాగేందుకే కాదు, వాడకానికి కూడా పనికిరాని నీటిని అందిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకూ సురక్షిత నీరు అందేలా రూ.69 కోట్లతో పనులకు టెండర్లు పిలిచి పని మొదలుపెట్టగా అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నిలిపి వేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం పూలపల్లిలోని నిరుపేదలు, మహిళలకు పది కిలోమీటర్ల దూరంలోని నక్కలతిప్ప ముంపు ప్రాంతంలో స్థలాలిచ్చి దగా చేసిందన్నారు. పూలపల్లిలో గాని, సరిహద్దులో గాని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోడి విజయభాస్కర్, పాముల రజనీకుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు, పెచ్చెట్టి.బాబు, వేగేశ్న శ్రీహరిరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

## ఆడపిల్లలు ఇంటికి అందం : ఉప ముఖ్యమంత్రి కొట్టు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఆడపిల్ల ఇంటికి అందమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్ల పుట్టడం చాలా అదృష్టంగా భావించాలన్నారు. ఆడపిల్లతోనే అభివృద్ధి ముడిపడి ఉంటుందని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ, స్వాతంత్రం ఉంటే ఆ కుటుంబం అన్ని విధాలుగా బాగుంటుందన్నారు. మహిళల చేతికి డబ్బులు ఇస్తే ప్రతి రూపాయి ఆ కుటుంబానికి ఉపయోగపడేలా సద్వినియోగం అవుతుందని తెలిపారు. జగనన్న ఇంటి స్థలం కూడా అక్క చెల్లెమ్మల పేరు మీద ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేలా సిఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 45 మంది బాలికలను, వారి తల్లిదండ్రులను మంత్రి సత్కరించారు. అలాగే తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది 12 మందిని సత్కరించారు. తాడేపల్లిగూడెం ఎంఇఒ, తాడేపల్లిగూడెం టౌను, రూరల్ పోలీస్ స్టేషన్ల నుంచి ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మొత్తం 60 మందిని సత్కరించి బహుమతులు అందజేశారు. ఇద్దరు బాలింతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి సత్యనారాయణ

## దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - ఆచంట**

ఈ నెల 16వ తేదీన శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. పెనుమంట్ర మండలం పోలమూరు నుంచి ఉదయం 9 గంటలకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన విలేకరులు తెలిపారు. పోలమూరు నుంచి, మాముడూరు, రామేశ్వరం, పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, ఆలమూరు, ఓడూరు, నెలమూరు, కొమ్ముచిక్కాల, పోలవరం, కవిటం మీదగా ఎం.ఎం.పాడు, ఆచంట వేమవరం చేరుకుని, మధ్యాహ్న భోజనం అనంతరం ఆచంట టౌను, కొడమంచిలి, సిద్ధాంతం, వడలి, పెనుగొండ, మార్టేరుకు చేరుకుని అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మికులు, రైతులు, కౌలురైతులు, ఉద్యోగులు, సిపిఎం నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని గోపాలన్ పిలుపునిచ్చారు.

## మాంటిస్సోరీ యాజమాన్యానికి అభినందనలు

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్లో మెగా సైన్స్ ఫేర్ నిర్వహించి కిలోమీటరు పొడవునా 623 ప్రాజెక్టులు ఏర్పాటు చేసి పిల్లలను ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించిన స్కూలు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు విద్యార్థుల తల్లిదండ్రులు. ఈ మెగా సైన్స్‌ఫేర్ గతంలో సాధించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌ను బ్రేక్ చేసిందని, అత్యధిక మంది సందర్శకులు సందర్శించినట్లుగా రికార్డులు సాధించడం, దేశంలోనే అతిపెద్ద సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యం మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసును తల్లిదండ్రులు సన్మానించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఇంత పెద్ద మొత్తంలో ఖర్చుకు వెనుకాడకుండా పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తలిదండ్రులు స్కూల్ యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

తాడేపల్లిగూడెం ఉల్లిపాయలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 38వ వార్షికోత్సవం గురువారం స్థానిక ఉల్లిపాయలు మార్కెట్ ఆఫీసు వద్ద చల్లా చంద్రరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా అధ్యక్షులు చల్లా చంద్రరావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2023వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కమాండర్ బంకూరి నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు 40 కోట్లమందికి కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మార్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారుణమని అన్నారు. రానున్న 60 రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయని బిజెపికి మద్దతు తెలిపే పార్టీలను ఓడించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సిరపరపు రంగారావు, అధ్యక్షులుగా చల్లా చంద్రరావు, వైస్ ప్రెసిడెంట్‌గా అల్లు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా గొర్లి శ్రీను, జాయింట్ కార్యదర్శిగా కరక వెంకటరావు, కమెండర్‌గా బంకూరి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా శిరపు గణేష్, గంటా కోటి, సిరపు మహేష్, గొర్లి రమేష్, బేతా అప్పారావు, దౌర్లు సీతయ్య, సలుమూరి సత్యనారాయణ, నందూరి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల సతీష్‌కుమార్, పులిమంతుల రమణ, సిరపరపు రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రతాప్

## ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ధర్నా

**ప్రజాశక్తి - పెనుమంట్ర (ఆచంట)**

పోలమూరు పంచాయతీ పరిధిలోని నాగలిదిబ్బలో 14 మంది లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల కోసం పుస్తెలమ్మి రూ.12 లక్షలు లబ్ధిదారులు చెల్లించగా చివరికి వైసిపి నాయకులు ఇళ్ల స్థలాలు లేవని చేతులెత్తేయడంతో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. వైసిపి ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల క్రితం స్థానికులకు ఇళ్ల స్థలాల కోసం భూమి సేకరించింది. స్థానిక రైతు వద్ద నుంచి రూ.50 లక్షలకు ఎకరం పొలం కొనుగోలు చేయగా, ఆ భూమి ప్రభుత్వపరంగా రూ.38 లక్షలకు కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో రూ.12 లక్షలగాను స్థానిక పెద్ద మనుషుల ద్వారా స్థలాలు కావాల్సిన వారు ఒకొక్కరూ రూ.30 వేలు చొప్పున చెల్లించారు. అయితే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా నాలుగున్నర సంవత్సరాల తర్వాత ఆ లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇవ్వడం కుదరదని వైసిపి నాయకులు తెగేసి చెప్పడంతో వారు కంగుతిన్నారు. రూ.30 వేలకు నాలున్నరేళ్లుగా వడ్డీ చెల్లించి నష్టపోయామని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బాధితులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు, బాధిత లబ్ధిదారులు చెల్లబోయిన సీత, కవురు మల్లేశ్వరి, కవురు వరలక్ష్మి, కండిబోయిన మంగాదేవి, కౌరు ఈశ్వరి, బొక్కా చిన్నారి, కౌరు రాజేశ్వరి, పాల్గొన్నారు.

పోలమూరులో ఇళ్ల స్థలాల వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

## విద్యాసామగ్రి అందజేత

**ప్రజాశక్తి - పోడూరు**

పెనుమదం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పరీక్షల పాడ్స్, పెన్నులు, స్టేషనరీని అందజేసే కార్యక్రమం జరిగింది. మొత్తం 63 మంది పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తానేటి బాబూరావు, వైసిపి మండల కన్వీనర్ పితాని సత్యనారాయణ (చిన్న), కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కడలి విజయ్ కుమార్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేసిన సొసైటీ సభ్యులు

## జెఇఇలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఆరుగొలను గురుకుల పాఠశాల విద్యార్థులు ఐదుగురు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన జెఇఇ మెయిన్స్ సెషన్-1లో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 10 మంది హాజరు కాగా బి.దినేష్, వి.సం జయకుమార్, యు.ప్రవీణ్‌తేజు, జె.మనోహర్, ఎం.సుధీర్ బాబు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

## విశ్వసనీయతకు మారుపేరు జగన్ : గ్రంధి

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేసి రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి నెలకొల్పుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం ఉత్తరపాలెం గ్రామానికి చెందిన టిడిపి, కార్యకర్తలు స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వీరవాసరం మండల కన్వీనర్ కడలి ధర్మారావు, కొట్టి కుటుంబరావు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, THOTA PARVATHI PADMA KUSUMA, W/o. MOHAN MURALI VENKATA BRAHMAJI, R/o. H.No. 5-3-56, Near Mekala Kamela, Mentevari Thota, Bhimavaram, Bhimavaram Mandal, W.G.Dt (A.P) - 534201. I have changed my name from **TOTA KUSUMA** (Old Name) to **THOTA PARVATHI PADMA KUSUMA** (New Name). Henceforth all my documents and correspondence will be continued with my New Name **THOTA PARVATHI PADMA KUSUMA.**

**పాస్‌పోర్టు పోయినది**

కర్రి కృష్ణారెడ్డి, తండ్రి: కర్రి వెంకటరెడ్డి అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఎస్.ఇల్లింద్రపర్రు నుండి పెనుమంట్ర వెళ్ళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. **S2634769** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: కర్రి కృష్ణారెడ్డి
తండ్రి: కర్రి వెంకటరెడ్డి
ఎస్.ఇల్లింద్రపర్రు, పెనుమంట్ర మండలం
పశ్చిమగోదావరి జిల్లా - 534225
సెల్: 9848093331

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.P. No. 3/2023 in O.S. No. 57/2022**

*Between:*
కర్రి శ్రీనివాసరావు ...DHR
మరియు
అన్నెపు రాజు ...JDR/ ప్రతివాది

పై నెంబరు E.P. పిటిషన్ నందు JDR మొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి ఇప్పటివరకు నోటీసులు తీసుకొనకుండా కోర్టు వారి ఎదుట హాజరు కాని కారణంగా శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీసు రూపంలో నోటీసు అమలు చేయమని ఆర్డరు వేసి ఉన్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, మీ యొక్క హాజరు నిమిత్తం పై నెంబరు E.P. పిటిషన్ నందు శ్రీ కోర్టు వాయిదా **ది. 19-2-2024వ తేదీన వేసియున్నందున ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారు ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**మాకా సత్యనారాయణ,** అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9949890672

FEDERAL BANK
YOUR PERFECT BANKING PARTNER

**గోల్డ్ అప్రైజర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం**

ఏలూరు నగరంలోని ఆర్.ఆర్.పేటలో ఉన్న ఫెడరల్ బ్యాంక్ శాఖలో గోల్డ్ అప్రైజర్ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులు నగరానికి చెందినవారై ఉండాలి. విశ్వబ్రాహ్మణ అయి ఉండాలి. బంగారు ఆభరణాల తయారీ, అప్రైజింగ్‌లో కనీసం 2 సం॥రాలు అనుభవం ఉండాలి. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 17-2-2024 లోగా బ్యాంక్ శాఖ అధికారులను సంప్రదించాలని బ్యాంకు అధికారులు తెలిపారు.

సం/- **బ్యాంక్ మేనేజర్**
ఫెడరల్ బ్యాంక్, ఏలూరు బ్రాంచి

**గ్రామపంచాయతీ కార్యాలయం, పుట్లచెరువు**
**మండవల్లి మండలం, ఏలూరు జిల్లా**

**టెండరు ప్రకటన**

తేది.15-02-2024

ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, పుట్ల చెరువు గ్రామపంచాయతి నందు R.O. ప్లాంట్ నిర్వహణకు ఆసక్తి/ సేవాదృక్పథము గల వారి నుండి టెండర్లు కోరుట.

| వ.నెం. | పని వివరము | ధరావత్తు |
|---|---|---|
| 1 | ఆర్.ఒ. ప్లాంట్ నిర్వహణ | రూ. 2000/- |

పై పేర్కొనబడిన పనిని నిర్వహించుటకు మరిన్ని వివరములు కొరకు దిగువ తెలియపరచిన గ్రామపంచాయతీ వారిని కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.

నోట్: చెల్లించిన ధరావత్తులు తిరిగి చెల్లించబడవు మరియు టెండర్ల రేట్ల మార్చుటకు గాని, టెండర్ల ప్రక్రియ నిలిపివేయుటకు గాని గ్రామపంచాయతికి అధికారము కలదు.

*తేది: 19-02-2024, ఉదయం 11.00 గం॥లకు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మ॥ 12 గం॥లకు టెండర్లు తెరవబడును.*

సం/- **ఎస్.వి.రాధిక**
కార్యదర్శి, గ్రామపంచాయితీ, పుట్లచెరువు
మండవల్లి మండలం

సం/- **జి.వెంకటేశ్వరరావు**
సర్పంచ్, గ్రామపంచాయితీ
పుట్ల చెరువు, మండవల్లి మండలం